వ్యవ‘సాయం’ ఏది?

- రైతులకు అందని పెట్టుబడి సాయం
- అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
- 'అన్నదాత సుఖీభవ' కోసం ఎదురు చూస్తున్న రైతులు


రైతులు సాగు చేస్తున్న వరిపంట

గుమ్మలక్ష్మీపురం:

దేశానికి వెన్నెముకైన రైతుకు కూటమి ప్రభుత్వంలో అవస్థలు తప్పడం లేదు. ఈ ఖరీఫ్‌లో నెలకొన్న వాతావరణ పరిస్థితులను ఎదురొడ్డి పంటలను సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచి సుమారు 3 నెలలవుతున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

మండలంలో గత ఐదేళ్లలో రైతుభరోసా కింద అందించిన నిధుల వివరాలు

సంవత్సరం	రైతులు	చెల్లించిన మొత్తం
2019-20	5,289	రూ.7.14 కోట్లు
2020-21	6,583	రూ.8.89 కోట్లు
2021-22	7,189	రూ.9.71 కోట్లు
2022-23	8,219	రూ.11.342 కోట్లు
2023-24	8,364	రూ.11.29 కోట్లు

హామీ అమలు చేయాలి



అధికారంలోకి వస్తే ఏటా పంటల సాగుకు రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. గత ప్రభుత్వం సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం అందేది. అందరికీ అన్నం పెట్టే రైతుకు భరోసా ఇవ్వకపోతే ఎలా వ్యవసాయం చేస్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకోవాలి.

– మండంగి రాధిక, జెడ్పీటీసీ సభ్యురాలు, గుమ్మలక్ష్మీపురం

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేసింది. పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసేది. అంతేకాకుండా కౌలు రైతులతో పాటు ఆర్ఓఎఫ్ఆర్, డీకేటీ పట్టాలు పొందిన రైతులను కూడా ఆదుకోవాలనే పెద్ద మనస్సుతో వారికి కూడా రైతు భరోసాను అమలు చేసింది.

భరోసా ఏది బాబూ..



గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు పెట్టుబడి సాయం(రైతు భరోసా) అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో సాగు పెట్టుబడులకు రైతులు అప్పులు చేయాల్సివస్తోంది. ప్రభుత్వం వెంటనే రైతులకు ఆర్థిక భరోసా అందించాలి. – కద్రక గుంపస్వామి, ఆలవడ్డ గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం

తప్పని ఎదురుచూపులు

ఈ ఖరీఫ్‌లో పంటల సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి సాగు పెట్టుబడులు పెట్టారు. ఎరువుల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో పెట్టుబడి సాయం ప్రతీ రైతుకు అవసరమే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలైనా రైతన్నలపై దృష్టి సారించకపోవడంతో రైతులకు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

పాలకొండ: నగర పంచాయతీకి సంబంధించి లుంబూరు పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ, సచివాలయాల సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు కాలనీలో జరిగిన ఇళ్ల నిర్మాణాల పరిస్థితిని సమీక్షించారు. లబ్ధిదారులకు అవగాహన కలిగించి 2025 మార్చి నాటికి నిర్మాణాలు పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లింపు జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది నిబద్ధతతో పని చేసి వెంటనే శత శాతం నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పాలకొండ - వీరఘట్టం రహదారి


అధ్వానంగా తయారైన పాలకొండ- వీరఘట్టం రహదారి

పాలకొండ రూరల్: పాలకొండ – వీరఘట్టం రహదారిలో ఎక్కడికక్కడే గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల ఒడిశాకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలు ఎక్కువ కావడంతో పాటు ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాల వల్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. ముఖ్యంగా వైఎస్సార్ కూడలి, అగ్నిమాపక కేంద్రం, పెట్రోల్ బంకు, తుమరాడ, నవగాం, వండవ సమీపంలో ఇలా ఎక్కడికక్కడ రోడ్డులో పెద్ద గుంతలు పడ్డాయి. గోతుల్లో నీరు చేరడం వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

మాతా, శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలి

- డీఎంహెచ్ఓ విజయపార్వతి


బాలేరు పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ విజయపార్వతి

భామిని: సంపూర్ణ అభియాన్ పోషణ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయి నుంచి సమన్వయంతో నిర్వహించి మాతా, శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. మండలంలోని బాలేరు, భామిని పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన పలు శాఖల సమన్వయ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విస్తృత ప్రచారం, గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా కార్తకర్తలు సమన్వయంతో పని చేయడం ద్వారా సత్ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ అభియాన్ పోషణ పథకం ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో పీహెచ్‌సీల వైద్యాధికారిణులు దీపికారాణి, సంతోషలక్ష్మి, వై.యోగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

పాలకొండ: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. అన్నవరం పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆందోళన చేసిన వారు అనంతరం తమ సమస్యలను వివరిస్తూ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.గౌరీశ్వరి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనలో ఎస్.శాంతి, ఎం.ధనలక్ష్మి, పి.శ్రీదేవి, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి ‘పీఎం జన్‌మన్’


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్ సుగణ, ఎంపీడీఓ మల్లికార్జునరావు, తదితరులు

కొమరాడ: గిరిజనలకు మౌలిక సదుపాయాలు కల్పించి జీవనోపాధులు మెరుగుపడేలా వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మల్లికార్జునరావు అన్నారు. కోటిపాం పంచాయతీ గుంపగదబవలసలో మంగళవారం సర్పంచ్ సుంకరి సుగణ అధ్యక్షతన పీఎం జన్‌మన్ పథకం అమలుకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి, విద్యుత్ సౌకర్యం, గ్రామాలకు రహదారుల నిర్మాణం, విద్య, వైద్యం, పౌష్టికాహారం, తదితర సౌకర్యాలను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గోపాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నవీన్‌కుమార్, వెలుగు ఏపీఎం వెంకటరమణ పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన


రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరి

వీరఘట్టం: బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనత వల్ల కలిగే అనర్థాలపై డాక్టర్ ఉమామహేశ్వరి అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక కూరాకులవీధి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి సరైన మోతాదులో పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. ఎంపీడీఓ వై.వెంకటరమణ, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంటల్లో జాగ్రత్తలు పాటించాలి

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో కూరగాయల పంటల్లో రైతులు అవసరమైన జాగ్రత్తలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించాలని ఏఓ ఎన్ని వాహిని అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంట భూముల్లోకి నీరు చేరడం వల్ల పంటలు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గరుగుబిల్లిలో రైతులకు కూరగాయల సాగుపై మంగళవారం పలు సూచనలు చేశారు. నీటి ఉధృతి కారణంగా పడిపోయిన మొక్కలు నిలబెట్టి దగ్గరగా మట్టిని కప్పాలన్నారు. లీటరు నీటికి 2.5 గ్రాముల సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల తెగులు ఆరికట్టవచ్చన్నారు.

క్లుప్తంగా

రక్తహీనత నివారణకు చర్యలు

సీతంపేట: మాతా శిశు మరణాలు అరికట్టాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. కుశిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. రక్తహీనతను తగ్గించడం, పోషకాహారం తీసుకోవడంపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి చాందిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు వీరఘట్టంలో కలెక్టర్ పర్యటన

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం బడితోట కార్యక్రమంలో భాగంగా వీరఘట్టంలో పర్యటించనున్నట్టు ఎంఈఓ గౌరినాయుడు మంగళవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

సీతంపేట: రహదారి భద్రతా నియమాలను వాహనచోదకులు పాటించాలని ఎస్ఐ జగదీష్ నాయుడు సూచించారు. గిరిజన యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం సీతంపేటలో మంగళవారం ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నుంచి భద్రత పొందేందుకు ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయవద్దన్నారు. వారికి పెద్దలు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల వితరణ


ప్లేట్లు, గ్లాసులు చూపుతున్న విద్యార్థులు

కొమరాడ: మండలంలోని మాదలింగి మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ తమరాడ కళావతి, పూర్వ విద్యార్థి బరాటం అభిషేక్ మంగళవారం స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. పాఠశాలలో చదువుతున్న 52 మంది విద్యార్థులకు ఉపాధ్యాయురాలు సంతోషికుమారి ద్వారా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం చేయడంలో సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీడి మొక్కల పంపిణీ


లబ్ధిదారులకు మొక్కలు అందిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

మక్కువ: మండలంలోని 14 పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జీడి మొక్కలను పంపిణీ చేశారు. 91 మంది రైతులకు 6,650 జీడి మొక్కలను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఉద్యాన తోటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని, అందులో భాగంగా రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో జీడి మొక్కలను అందిస్తున్నట్లు తెలిపారు. జీడి తోటల సాగుతో ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. మండలంలోని రెడ్డిపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా తగ్గిన అడవుల శాతం కారణంగా ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని, భవిష్యత్ తరాలు బాగుండాలంటే మనమంతా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్.హరనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూకాలమ్మ, శశికళ, అమ్మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేయాలి


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో బాధపడేవారికి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు సూచించారు. తాడికొండ పీహెచ్‌సీలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలపై మంగళవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, ఆకు కూరలు, కాయగూరల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం


గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పలువురు గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. ఇందులో భాగంగా గర్భిణులకు పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కొమరాడ ఐసీడీఎస్ పీఓ జి.సుగుణకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఓ తెలిపారు.

జీడి పంట పునరుద్ధరణపై శిక్షణ


రైతులకు కంది విత్తనాలు అందజేస్తున్న వినోద్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని కోసంగూడ గ్రామంలో, నీలకంఠాపురం, ఒబ్బంగి పంచాయతీల పరిధిలో ఉన్న రైతు ఉత్పత్తిదారు సంఘాల సభ్యులకు నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఆధ్వర్యంలో మంగళవారం జీడి పంట పునరుద్ధరణ పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ గిరిజ జీడి మొక్కలను ఏ విధంగా సంరక్షించాలి, పాత చెట్లకు కొమ్మల కత్తిరింపు, ఎరువుల యాజమాన్యం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఎఫ్‌పీఓ వినోద్‌కుమార్ రైతులకు కదిరి–6 హైబ్రీడ్ కంది విత్తనాలను అందజేశారు. వరి పంట గట్లపై కంది పంట సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ కన్సల్టెంట్ ఎస్.సోనియా, గ్రామ పెద్దలు ఎం.గణపతి, ఎం.అడ్డమేశ్వరరావు తదితరులున్నారు.

హెల్మెట్ తప్పనిసరి


హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తున్న ఎస్సై రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్సై పి.రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామ సమీపంలో మంగళవారం వాహన చోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ లేకుండా ప్రయాణం చట్టరీత్యా నేరమన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై అపరాధ రుసుం విధించడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణమోహన్, ఉమామహేశ్వరరావు, సుధాకర్ తదితరులున్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం


నగదు అందజేస్తున్న సంజీవనాయుడు, గ్రామస్తులు

బలిజిపేట: విశాఖ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న నిరుపేద కుటుంబానికి పెదపెంకి గ్రామానికి చెందిన గుడివాడ హరినాథ్ రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం వితరణ చేశారు. ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేసినట్లు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన డర్రు సుమన్ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితిని హరినాథ్‌కు వివరించగా ఆయన వెంటనే స్పందించి రూ.10 వేలు పంపించినట్లు చెప్పారు. గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు.

నేత్రదానానికి ముందుకురావాలి

సంతకవిటి: నేత్ర దానానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు యు.నాగేంద్రప్రసాద్, బి.సౌమ్య కోరారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. అన్ని దానాలలో కన్నా నేత్రదానం చాలా గొప్పదని, మనమిచ్చే నేత్రాలు మరో ఇద్దరికి చూపును ప్రసాదిస్తాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. నేత్రదానంపై ఉన్న అపోహలు విడనాడాలన్నారు. మరణానంతరం ఆరు గంటల్లోగా నేత్రదానం చేయాలన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన

వంగర: మండలంలోని మద్దివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వై.దుర్గారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ విద్యార్థులకు జరుగుతున్న పరీక్షలు, మధ్యాహ్న భోజనం వంటకాలు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకోవచ్చని ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.మోహనరావు, ఉపాధ్యాయులు పి.దిలీప్‌కుమార్, వై.వి.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల్లో నీలి నాలుక వ్యాధిపై అప్రమత్తత అవసరం

- పశు సంవర్థక శాఖ ఏడీ ప్రభ మాణిక్యరావు




ఈ తరహా గొర్రెల్లో నీలినాలుక వ్యాధి వ్యాపిస్తుంది

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి వ్యాప్తి చెందుతుందని పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రభ మాణిక్యరావు మంగళవారం పేర్కొన్నారు. వైరస్, క్యూలికోయిడస్ అనే ఈగ జాతికి చెందిన కీటకాల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఒక జీవి నుంచి మరొక జీవికి ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. ఈ కీటకం శరీరంలోకి ప్రవేశించిన 10 రోజుల్లో ఒక్కో గొర్రె నుంచి మందలో మిగిలిన గొర్రెలకు వ్యాపించే ప్రమాదం ఉందని, రానున్న డిసెంబర్ నెల వరకు ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు

కీటకం కాటు ద్వారా గొర్రె శరీరంలోకి వైరస్ ప్రవేశించిన వారం రోజుల్లో వ్యాధి లక్షణాలు గుర్తించవచ్చు. తొలుత 105 – 106 డిగ్రీల జ్వరం వచ్చి ఐదు రోజులు పైబడి ఉంటుంది. జ్వరం వచ్చిన 48 గంటల తరువాత నోటి నుంచి చొంగ కారడం, నోరు మొత్తం ఎర్రగా మారిపోవడం, చొంగ నురగలా మారి పెదవులు, చిగుళ్లు, పైదవడ, నాలుక వాచిపోవడం, దవడలు అసంకల్పితంగా వణకడం, నాలుక ఇరువైపుల పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలిరంగుకు మారుతుంది. ఈ లక్షణాలన్ని నీలి నాలుక లక్షణాలుగా గుర్తించాలి. దీని వల్ల చూడిగొర్రెల్లో గర్భస్రావం జరుగుతుంది.

చికిత్స ఇలా...

వైరస్ వలన వచ్చే వ్యాధులు కావడంతో వీటికి సరైన చికిత్స అంటూ ఏమీ ఉండదు. కాని వ్యాధి ఉధృతిని తగ్గించేందుకు వైద్యం ఉపయోగపడుతుంది. పొటాషియం పర్మాంగ్‌నేట్ ఒక శాతం ద్రావణంతో నోటిలో పుండ్లను కడిగి, శుభ్రమైన పాడిగుడ్డతో తుడిచి యాంటీసెప్టిక్ మందులు పూయాలి. ఏంటీబయోటిక్ మందులు నోటి ద్వారా, ఇంజక్షన్ రూపంలో ఐదు నుంచి ఏడు రోజులు ఇవ్వాల్సి ఉంటుంది. బ్లూటంగ్ వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేయించాలి. ఎన్రోఫ్లాక్సిన్, సిప్రోఫ్లాక్సిన్, సల్ఫా మొదలగు ఏంటీబయోటిక్ మందులు వైద్యుల సూచనల మేరకు వాడుకోవచ్చు.